# కారుమబ్బులు

"మరో ప్రపంచం, మరో ప్రపంచం" అని కలలుకంటూ కవిత చెప్పాడొక మహాకవి. అతను వూహించిన మరో ప్రపంచంలో అందరికీ పుష్కలంగా తినడానికి తిండి, కట్టుకోడాని బట్ట, ఉండడానికో చిన్న ఇల్లు ఇలా ఉంటే ఇది రామరాజ్యం, ప్రజారాజ్యం. ఇవి మనిషికోరే కనీసపు సౌకర్యాలు.

అందరూ వీటికోసమే పరితపించేది. కాని ఇంతటితో మనసు తృప్తి పడుతుందా? ఏమో! అన్నీ ఉన్నా అసంతృప్తి మనిషి స్వభావం. మనసు ఏవో ఊహలతో తనకో నరకం సృష్టించుకుని అవతల వాళ్ళకొక నరకం సృష్టిస్తూ ఉంటుంది. అన్నీ ఉన్నా స్వర్గసీమ ఎప్పుడూ అందుబాటులోనే ఉన్నట్లుండి ఎప్పుడూ అల్లంత దూరంలోనే ఉంటుంది.

మనిషికి, జంతువుకి ఉన్న తేడా మనసు ఊహించే శక్తి ఆలోచించే శక్తి. మరి ఇది వరమో! శాపమో! ప్రతి వ్యక్తిది ఒక ప్రత్యేకమైన రంగు కళ్ళద్దం. ఇంక ప్రపంచమంతా అతనికి ఆ రంగులోనే కనిపిస్తుంది. ఒక్కొక్కరిది ఒక్కొక్క రంగు. నువ్వు చూసేది పచ్చరంగు కాదు సుమా, ఇది నిజానికి నీలం రంగు అని ఎంత చెప్పినా అతనికి అర్థంకాదు. అతనికి కనిపించేది పచ్చరంగు మాత్రమే. మనకు కనిపించేది నీలం రంగు మాత్రమే. ఇది మన పూర్వజన్మ సంస్కారమో, మన కర్మఫలమో ఏదో! ఈ రంగులు సృష్టించేది మనస్సు. ఇది ఒక రకమైన బరువు, మనకూ, మన చుట్టూ ఉన్నవాళ్ళకు.

ఈ మనసు నరకాన్నీ సృష్టించగలదు. స్వర్గాన్నీ సృష్టించగలదు. నిర్మలంగా ఉన్న నీటిలో నీడలు సృష్టించగలదు. ఇది మన అధీనంలో ఉన్నట్లే ఉంటుంది. నిజానికి మనమీద అధికారం చెలాయిస్తూ ఉంటుంది. అందుకే కాబోలు అన్నారు మహనీయులు "మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షణాత్" అని.

అసురసంధ్యవేళ ఆకాశాన్ని అవలోకిస్తున్న నాలో ఏవో ఆలోచనలు రేకెత్తుతున్నాయి. ఒక పరిధి, గమ్యమూ లేకుండా, నిజానికి నేను శ్రీధర్ను గురించి ఆలోచిస్తున్నాను. అతనికి నాకూ వివాహమై మూడేళ్ళు కావస్తోంది. అతను నేనూ ఒకే ఆఫీసులో పని చేస్తున్నాము, ఒకే సెక్షనులో. అసలు ఇద్దరమూ ఉద్యోగంలో ఒకేసారి చేరాం కూడా. కాకపోతే రెండు మూడు రోజులు తేడా. నేను చేరిన నాలుగోరోజు కాబోలు అతను వచ్చాడు. నా పక్కనే ఉన్న సీటులో పని చేయడానికి. ఇద్దరికీ ఉద్యోగం కొత్త, ఊరు కొత్త. ఒకరికొకరము పరిచయమవడము, సహాయపడడమూ తప్పనిసరి అయింది. నేను హాస్టలులో ఉన్నాను. అతను బంధువుల ఇంట్లో ఉన్నాడు. క్రమంగా పరిచయం, స్నేహము, అభిమానంగా మారి వివాహంవైపు దారి తీసింది.

మాకు రెండువైపులా అభ్యంతరం చెప్పేవాళ్ళెవరూ కనిపించలేదు. 'సరేనని సంతోషపడిన వాళ్ళు తప్ప, కట్నాలు ఆడంబరాలు వద్దనుకోవడం వల్ల ఏదో పండగ జరిగినట్లే మాపెళ్ళి సింపుల్గా జరిగిపోయింది. అతనికి పొరుగింటి భోజనం, నాకు హాస్టలు భోజనం రెండూ తప్పి ఇదరికీ ఏక నివాసం, ఏక భోజనం, ఏక జీవితం ఏర్పడ్డాయి.

పెళ్ళయ్యాక నేను ఉద్యోగం చెయ్యాలా అక్కర్లేదా అన్న ప్రశ్నే ఎప్పుడూ రాలేదు. ఉద్యోగం మానెయ్యాలని నేను ఎప్పుడూ అనుకోలేదు.

అతనూ అనుకోలేదు రెండు మూడేళ్ళదాకా సంతానం వద్దని ముందరే అనుకోడం చేత. ఇంత ఉద్యోగం మానెయ్యాల్సిన ఇబ్బందులు ఏమీ లేవు.

రెండు మూడేళ్ళగా మా జీవితం సుఖంగానే గడిచిపోతోంది, నందనవనంలాగా! పొద్దున్నే కలిసి భోజనం చెయ్యడం, కలిసే ఆఫీసుకు వెళ్ళడం, మళ్ళా సాయంత్రం కలిసే తిరిగి రావటం. ఆకలి వేసిన రోజు తోవలోనే ఎక్కడైనా టిఫిన్ తినిరావడం, లేని రోజు ఓపిక ఉంటే నిదానంగా ఇంటికివచ్చి తీరిగ్గా టిఫిన్ చేసుకుని డాబా మీద తింటూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చోవడం! ఆదివారం అయితే అలా సినిమాకో స్నేహితులిండ్లకో వెళ్ళడం, లేకపోతే ఎవరినైనా మా ఇంటికి పిలవడం ఇలా గడిచిపోతోంది.

మా ఇల్లు నందనవనం కాదు. మాకున్నది మేడమీద ఒక చిన్న పోర్షన్ మాత్రమే. కాని శాస్త డాబా ఉంది. అందులో చాలా రోజా పూల చెట్లు తొట్లలో పెట్టాము. ఆ రంగు రంగు పూలమధ్య కూచుని నిర్మలంగా ఉన్న ఆకాశాన్ని చూస్తూ ఉంటే ఏదో నందనవనంలో ఉన్నట్లే మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. మనస్సు బాగుంటే అన్నీ బాగుంటాయి.

శ్రీధర్ మంచివాడే. ఒక కోపమూ, చిరాకు ఇంట్లాంటివేవీ ఉండవు. కాకపోతే అతని మాటల్లో, చేష్టల్లో అప్పుడప్పుడు అతనికి చిన్నతనం ఇంకా వదల్లేదేమో అనిపిస్తూ ఉంటుంది. అయినా నేను పట్టించుకోకుండా సర్దుకుపోతూనే ఉంటాను. దేన్ని గురించి మూర్ఖంగా ప్రవర్తించే అలవాటు నాకులేదు.

మూడు నెలల క్రిందట సీనియర్ ఆఫీసర్‌గా నాకు ప్రమోషన్ వచ్చింది. వేరే సెక్షన్‌కు మార్చారు. అంతకుముందు ఒక నెల రోజులుగా నాకు ప్రమోషన్ వస్తుందని ఆఫీసు అంతా మారుమోగుతోంది ఈ వార్తలు

ఎక్కడ ప్రారంభమై ఎలా బయటికి వస్తాయో తెలియదుగాని, సాధారణంగా అన్ని విషయాలు అందరికి ముందుగానే తెలిసిపోతూ ఉంటాయి. దీన్ని గురించి నేనేమీ ఎక్కువ పట్టించుకోలేదు. వస్తేరానీ లేకపోతే పోనీ అన్నట్లు నిర్లిప్తంగా ఉండిపోయాను.

కాని ఈవార్త ప్రారంభమైనప్పటి నుంచి ఎందుకో శ్రీధర్ కొంచెం ముభావంగా, నిరుత్సాహంగా ఉన్నట్లనిపించింది. అయినా అదీ నేను అంతగా పట్టించుకోలేదు. రోజులు మామూలుగానే సాగిపోతూ వచ్చాయి.

ఆర్డర్స్ వచ్చిన రోజు అందరూ సంతోషపడుతూ, ఆ వేళ తప్పకుండా పార్టీ ఇవ్వాలంటూ హడావిడి ప్రారంభించారు. నేను నవ్వుతూ ఊరుకున్నాను.

ఆ వేళ నా సీటు మారింది. శ్రీధర్‌కు దూరంగా ఇంకో సెక్షనుకు వెళ్ళిపోయాను. ఆ తరువాత ఆ రోజంతా మళ్ళా ఆఫీసులో శ్రీధర్‌ను కలుసుకోనేలేదు.

సాయంత్రం మామూలుగా కాంటీన్‌లో పార్టీ ప్రారంభమైంది. అందరూ వచ్చారు. మామూలుగా పార్టీ సాగుతోంది. వచ్చిన వాళ్ళు ఇచ్చిన టిఫిన్ తిని కంగ్రాచ్యులేషన్స్ చెప్పి వాళ్ళ తోవన వాళ్ళు పోతున్నారు. శ్రీధర్ మాత్రం ఎక్కడా కనిపించలేదు. అది ఎవరూ అంతగా పట్టించుకోలేదు. సాయంత్రం అయితే ఎవరి తోవన వాళ్లు ఇళ్ళకు పోయే తొందరలో ఉంటారు. ఎవరి పనులు వాళ్ళవి. నేను మాత్రం శ్రీధర్ ఎందుకు రాలేదు అని ఆలోచిస్తూ దిగాలుపడి కూర్చున్నాను.

ఒకరిద్దరు మాత్రం అడిగారు "శ్రీధర్ కనిపించడేం? ఎందుకు రాలేదు?" అని. నేను చిరునవ్వు నవ్వుతూ "పని ఉన్నట్లుంది రాలేదు" అని మాత్రం అన్నాను. అంతకన్నా ఏం చెయ్యగలను? భర్త ఎక్కడున్నాడో

ఎందుకు రాలేదో తెలియని ఆడది అందరికీ చులకనగా ఉంటుంది. అంచేత ఒక మేలి ముసుగు కప్పుకోక తప్పలేదు.

పార్టీ అయి అందరూ వెళ్ళిపోయారు. నేను ఒంటరిగా మిగిలాను. కొద్దిగా చీకటి కూడా పడుతోంది. కాంటీన్‌వాళ్ళు కూడా సామాను సర్దుకుంటున్నారు, మూసేసి వెళ్ళిపోవడానికి. ఇంక లేవక తప్పలేదు.

ఒంటరిగా ఇంటికి వెళ్ళాలి. ఇంతవరకు ఎప్పుడూ అలవాటు లేదు. ఏదో కొత్తగా వుంది. బయటికి వచ్చి రిక్షా కోసం వెతుక్కున్నాను. చప్పునే దొరికింది. తోవ పొడుగునా ఏదో శూన్యంగా అనిపించింది.

ఇంటికి చేరేటప్పటికి శ్రీధర్ అక్కడా లేడు. ఉస్సూరుమంటూ మేడ మెట్లు ఎక్కి వెళ్ళాను. మా ఇంటికి సంరక్షులుగా ఎప్పుడూ మా కింద ఇంటి వాళ్ళు ఉంటారు. ఆవిడే తాళాలు ఇచ్చింది. "ఒక్కరే వచ్చారేం?" అంటూ మా ఇంటి తాళాలు ఎప్పుడూ వాళ్ళ దగ్గరే ఉంటాయి.

ఎక్కువగా దిగులుపడేస్వభావం నాకు లేదు. ఉన్నదాంట్లో ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ప్రయత్నం. అందుకని ఎక్కువ ఆలోచించకుండా స్నానంచేసి టిఫిన్ తయారుచేసి రేడియో వింటూ కూర్చున్నాను. రాత్రి ఎనిమిది దాటుతూ ఉంటే శ్రీధర్ వచ్చాడు. ఎక్కువగా అలసిపోయినట్లున్నాడు. నేనేమీ అడగలేదు. అతనే చెబుతాడు కదా అని అతనూ స్నానంచేసి వచ్చి కూర్చున్నాడు మామూలుగానే మాట్లాడుకుంటూ టిఫిన్ ముగించాము. అప్పుడు అన్నాను. "పార్టీలో అందరూ నువ్వు రాలేదే"మని అడిగారని. అతను ముఖం తప్పించుకుంటూ "తలనొప్పిగా ఉంటే బజారు వైపు వెళ్ళాను. మాత్రలు తెద్దామని" అన్నాడు.

అది మా ఇద్దరి మధ్య మొదటి అబద్ధం. అది అతనికీ తెలుసు, నాకూ తెలుసు. అయినా ఇద్దరం అంతకన్నా ఏం మాట్లాడలేదు. అతనొక వైపు నేనొక వైపు నిద్ర మాత్రం దానంతటదే వచ్చింది.

మర్నాడు పొద్దున మామూలుగానే అన్ని పనులు చేసుకున్నాను ఆఫీసుకు టైం కాకుండానే అతను బయలుదేరి వెళ్ళిపోయాడు. తనకు తోవలో ఏదో పని ఉందంటూ. ఈ ప్రవర్తన కొత్తగా వింతగా ఉన్నా నేను బాధ పడలేదు. పోనీలే అనుకున్నాను నా తోవన నేను వెళ్ళాను.

ఆఫీసులో అతనికి నాకు మునుపటిలా సన్నిహితంగా ఉండే అవకాశం లేదు. అతని సెక్షన్ ఒక మూల, నాది ఇంకొక మూల. ఆఫీసు అయిన తరువాత అతనికోసం వెదుక్కున్నాను. అతను ఎక్కడా కనిపించ లేదు. మళ్ళీ ఉసూరుమంటూ నా తోవన నేను ఇంటికి వెళ్ళిపోయాను.

మళ్ళీ మామూలే! ఆ వేళ ఎనిమిదిదాటాక వచ్చాడు అయితే ఈ రోజు ఎక్కడికి వెళ్ళావని నేను అడగలేదు. అతను చెప్పనూ లేదు అంతే అలాగే యాంత్రికంగా రోజులు గడుస్తున్నాయి. మా ఇద్దరి మధ్య ఒక కొత్తరకమైన జీవితం ప్రారంభమైంది సన్నిహితం గానూ లేము. దూరం గానూ లేము. అయినా అది ఏమీ గమనించనట్లే ఇద్దరమూ నటిస్తున్నాము. ఇది ఇలా ఎన్నాళ్ళ సాగుతుంది?

అప్పుడప్పుడు డాబామీద ఒంటరిగా ఉన్నప్పుడు నాకనిపిస్తుంది. ఇతని మనసులో ఏవో కారుమబ్బులు కమ్ముకుంటున్నాయని ఈ మబ్బులు నా ప్రమోషన్ రోజే ప్రారంభమయ్యాయి కాబట్టి నా ప్రమోషన్‌కు, ఇతని మనసు మారడానికి ఏదో సంబంధమున్నదని.

అది ఏమై ఉంటుంది? నాకెందుకు ప్రమోషన్ వచ్చింది. తన కెందుకు రాలేదు అనుకుంటున్నాడా ? అది ఎందుకో నాకూ తెలియదు. అతనూ నేనూ ఒకేసారి చేరాం. కాకపోతే నేను మూడు రోజులు ముందుగా చేరాను. అది సీనియారిటీ కింద వస్తుందా? అతను బి.కాం. మాత్రం పాసయ్యాడు. నేను ఎమ్.కాం. కూడా చదివాను అది కారణమయ్యుంటుందా?

అసలు నాకు ప్రమోషన్ వచ్చింది. తనకు రాలేదని బాధపడుతున్నాడా? లేక నేనిప్పుడు సీనియర్ ఆఫీసర్‌ని కాబట్టి తన్ను చులకనగా చూస్తాననుకుంటున్నాడా?

ఏది మనసులో పెట్టుకుని ఎందుకు బాధపడుతున్నాడు? ఏదైనా మనసు విప్పి మాట్లాడితే మనసులో మబ్బులు మాయమౌతాయి. లేకపోతే ఏం చెయ్యగలం! తరచి అడిగినా చెప్పడు. మనిషి మారడు ఈప్రమోషన్ వచ్చింది మొదలు రోజు రోజుకు మేము దూరమౌతున్నామా అనిపిస్తోంది అల్లాగే మూడు నెలలు గడిచిపోయ్యాయి.

ఆవేళ అకస్మాత్తుగా శ్రీధర్ నా సెక్షన్‌లో కనిపించాడు. చేతిలో ఏదో కవరు ఉంది. ఒక్క క్షణం నాకోసమే వచ్చాడనుకుని సంబరపడిపోయాను కాని అతను నావైపైనా చూడకుండా మేనేజరు గదికి వెళుతున్నాడు మేనేజరు గదికి వెళ్ళటానికి మా సెక్షన్ లోనించే వెళ్ళాలి.

నేనే లేచి అతని దగ్గరకు వెళ్ళాను. "ఏమిటి విశేషం? మేనేజరును చూడాలా?" అన్నాను "అవును అందుకే వెళుతున్నాను" అన్నాడు. "ఆయన రూములో లేడు. ఏదో మీటింగు ఉందని వెళ్ళాడు" అన్నాను. "ఫరవాలేదు ఈ కవరు అతని బల్లమీద పెడతాను" అన్నాడు నేను వద్దులే, నాకియ్యి నేనే ఆయన వచ్చాక ఇస్తానులే" అన్నాను అతను వినిపించుకోలేదు. తట పటాయిస్తున్నాడు. నేను ఇంచుమించు బలవంతంగా ఆ కవరు లాక్కున్నాను. అతను వెళ్ళిపోయాడు. ఆరోజు సాయంత్రం దాకా మేనేజరు రానేలేదు. నా పని అయిపోయింది. శ్రీధర్ ఇచ్చిన కవరు డ్రాయరులో పెట్టి నేను ఇంటికి వెళ్ళిపోయాను.

ఆవేళ అపురూపంగా శ్రీధర్ ఇంట్లోనే ఉన్నాడు. నేను ఆశ్చర్య పడ్డాను. కాని ఏమీ అనలేదు. నేను వెళ్ళేటప్పటికి అతను స్నానం చేసి కూర్చుని రేడియో వింటున్నాడు. నేను స్నానం చేసి త్వరగా టిఫిన్ చేసి

ఉంచాను. మామూలుగా డాబామీద కూర్చున్నాము. టిఫిన్ తింటూ అప్పుడు అడిగాడు అతను. "ఆ కవరు మేనేజరుకు ఇచ్చావా?" అని "లేదు ఇవ్వాళ మేనేజరు రాలేదు. రేపు ఇస్తాను" అన్నాను. ఒక్కక్షణం మౌనంగా ఉన్నాడు తరువాత అన్నాడు "ఆ కవరులో ఏముందో తెలుసా?" అని

"లేదు. చెవుతావా?" అన్నాను.

"నేను ఉద్యోగం రాజీనామా చేస్తున్నాను" అన్నాడు.

ఈసారి నేను మౌనంగా ఉన్నాను. కాస్సేపయ్యాక అడిగాను "ఎందుకూ?" అని.

"నాకు ఇష్టంలేదు వేరే ఉద్యోగం చూసుకుంటాను" అన్నాడు.

నాకేమీ అంతు పట్టలేదు. అలాగే ఆలోచిస్తూ కూర్చున్నాను. కాస్సేపటికి నాకు నవ్వు వచ్చింది. అతనికేమీ పాలు పోలేదు.

"ఎందుకు నవ్వుతావు?" అన్నాడు

"ఏమీలేదు ఇవ్వాళే నేనూ రిజైన్ చెయ్యాలనుకున్నాను" అన్నాను.

"ఎందుకూ?" ఈసారి ఆశ్చర్యపడ్డం అతని వంతైంది. నేను నవ్వుతూ అన్నాను "ఏమీలేదు తొందరగానే మనకో పాప పుడుతుంది. మరి ఇంట్లో చూసుకోటానికి మనకు ఎవరూ లేరు కదా! పైగా ఎక్కువ రోజులు ఉద్యోగం చెయ్యాలని ఎప్పుడూ అనుకోలేదు. నీ జీతమే మనిద్దరికీ సరిపోతుందనుకున్నాను".

అతనేదో షాక్ తిన్నట్లు చూస్తున్నాడు నవ్వుతూ చెప్పాను "అవును నిజమే ఐదారు నెలలుగా నేను మాత్రలు వేసుకోవడం మానేశాను. నిన్ననే డాక్టరును కూడా చూసి వచ్చాను." అతని ముఖంలో క్రమంగా వికాసం వచ్చింది. కాస్సేపు విశ్రాంతిగా మౌనంగా కాలం గడిచింది. చివరకు నేనే

అన్నాను "ఇద్దరమూ ఒకేసారి ఉద్యోగం మానేస్తే ఎలాగ? అంచేత కొన్నాళ్ళు నువ్వు చెయ్యి తరువాత చూద్దాము ఒకవేళ నా తరువాత నా పోస్ట్ నీకు వస్తే రావచ్చును" అతను సిగ్గు పడుతున్నట్లు కనిపించాడు. ముఖం చేతుల్లో కప్పుకు కూర్చున్నాడు. నేను అతని చెయ్యి పట్టుకున్నాను ఆప్యాయంగా! ఆ క్షణం నాకు కోపం అనిపించలేదు.

ఆ తరువాత అతను మామూలు మనిషి అయ్యాడు. మనసులో మబ్బులు మాయమయ్యాయి. మళ్ళా జీవితం మామూలుగా సాగుతోంది.

కాని విచిత్రంగా అప్పటి నుంచి నా మనసులో మబ్బులు కమ్ము కుంటున్నాయి. అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. 'అబ్బ! ఎంత సంకు చితమైన మనిషి! నాకు ప్రమోషన్ రాగానే అనవసరమైన ఆలోచనలతో మనసు పాడు చేసుకున్నాడు. ఎప్పటికి ఈ చిన్నతనం వదులుతుందో!' అని.

ఇల్లాంటి ఆలోచనలు రాగానే నాకు కాస్త అతనికి దూరంగా జరిగి కూర్చోవాలనిపిస్తుంది. మళ్ళా అంతలో నా ప్రవర్తనకు నాకే నవ్వు వస్తుంది. నా మనసులో మబ్బులు నాకే కనిపిస్తూ ఉంటాయి. ఇది కొంత నయం, పూర్తిగా మునిగిపోకుండా!

"ఉద్ధారేదాత్మ నాత్మానామ్" అన్నారు. నిజమే తన్ను తాను ఉద్ధ రించుకోవాలి. లేకపోతే ఈ కారుమబ్బుల నుంచి మనిషి విముక్తి పొందేది ఎప్పుడో!